క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా



పతకాలు సాధించిన కర్నూలు క్రీడాకారులు

కర్నూలు (టౌన్): గుంటూరు పట్టణంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కర్నూలుకు చెందిన పలువురు అథ్లెట్లు పతకాలు సాధించారు. పురుషుల విభాగంలో వెంకటేష్ నాయుడు (షాట్‌పుట్ ప్రథమ స్థానం), మహిళల విభాగంలో మైత్రి (హైజంప్ ప్రథమ స్థానం), 5 వేలు, 10 వేల మీటర్ల పరుగు పందెంలో వెంకటేశ్వరి (ద్వితీయ స్థానం), 1500 మీటర్ల పరుగులో ప్రసన్న (ద్వితీయ స్థానం), వంద మీటర్ల హర్డిల్స్‌లో సుకన్య (ద్వితీయ స్థానం) సాధించారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన అథ్లెట్లను స్థానిక అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మయ్య, శ్రీనివాసులు, కోచ్ కాశీరావు, హర్షవర్ధన్ తదితరులు అభినందించారు.

ఎస్‌ఎఫ్‌ఐ మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కర్నూలు కల్చరల్: ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మహాసభల పోస్టర్లను సోమవారం రాయలసీమ యూనివర్సిటీ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.వెంకటబసవరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బోయ విజయకుమార్ నాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో నిర్వహించనున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఇళ్ల స్థలాల కోసం కదం తొక్కిన సీపీఎం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం కదం తొక్కింది. సోమవారం జిల్లా కమిటీ పిలుపు మేరకు కర్నూలు నగరంలోని అన్ని సచివాలయాలు, కర్నూలు రూరల్, అర్బన్, కల్లూరు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆ పార్టీ శ్రేణులు నిరసనకు దిగాయి. ఈ సందర్భంగా నగర కార్యదర్శులు టి.రాముడు, రాజశేఖర్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా పట్టణాల్లో 2, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీడీఎంలో ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభం



ఫిట్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ మూర్తి తదితరులు

కర్నూలు (సిటీ): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీ డీఎం)లో కొత్తగా స్థాపించిన శ్రీకృష్ణ దేవరాయ యువ క్రీడ ప్రాంగణం (స్పోర్ట్స్ అరీనా), అవుట్‌డోర్ జిమ్ మరియు ఫెమినా ఫిట్‌నెస్ సెంటర్ (లేడీస్ జిమ్)లను సోమవారం ఐఐఐటీడీఎం డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఫిట్‌నెస్ సెంటర్లు చక్కగా ఉపయోగపడతాయన్నారు. క్యాంపస్ కమ్యూనిటీలో సమగ్ర శ్రేయస్సు, శారీరక దృఢత్వం, వినోద అభివృద్ధిని ప్రోత్సహించడం కోసం వీటిని ఏర్పాటు చేశామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రియాశీల జీవనాన్ని ప్రోత్సహించడానికి, ఫిట్‌నెస్ సంస్కృతిని పెంపొందించడానికి, క్యాంపస్‌లోని సభ్యులందరికీ నాణ్యమైన వినోదమాలిక సదుపాయాలను పొందేలా చూసుకోవడానికి ఈ ఆధునిక సౌకర్యాలను ఆలోచనాత్మకంగా అభివృద్ధి చేశామన్నారు. ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోపే ప్రభుత్వంపై వ్యతిరేకత

- విధ్వంసం, అరాచకం తప్పా.. అభివృద్ధి ఏదీ?
- ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుగా వైఎస్సార్‌సీపీ ఉంటుంది
- జగనన్న అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం బుక్‌లెట్ ఆవిష్కరణ



కూటమి ప్రభుత్వ ఏడాది విధ్వంస పాలనపై బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్

కర్నూలు (టౌన్): ఏడాదిలోనే చంద్రబాబు పాలనపై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్ అన్నారు. సోమవారం స్థానిక ఏ.క్యాంపులోని కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అరాచకాలు, మోసాలను వివరిస్తూ రూపొందించిన 'జగనన్న అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు ఏడాది పాలన అంతా చీకటి రోజులేనని విమర్శించారు. జగనన్న ఇచ్చిన పథకాల కంటే రెండింతలు ఇస్తామని అలివిగాని హామీలు ఇచ్చారన్నారు. అయితే ఏడాది పాలన పూర్తయినా హామీలు అమలు చేయడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ఆందోళనల నేపథ్యంలో విధిలేక 'తల్లికి వందనం' నిధులు మంజూరు చేశారని చెప్పారు. రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లికి వందనం పథకానికి అర్హులు కాగా 30 లక్షల మందికి సాయం అందించకుండా మోసం చేశారని మండిపడ్డారు. రెండో ఏడాది పాలన ప్రారంభమైనా రైతుకు భరోసా, క్రాప్ ఇన్సూరెన్స్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి సంవత్సరం 5 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే 4 లక్షల ఉద్యోగాలు తొలగించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నిరుద్యోగులకు రూ.3 వేలు భృతి ఇస్తామని ఆశలు కల్పించి ఏడాది దాటినా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఇంగ్లిష్ మీడియం, బైజూస్ పాఠాలు, ట్యాబ్‌లు, నాడు – నేడు కింద పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దితే ఇప్పుడు వాటన్నింటినీ నిలిపివేసి విద్య వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. కార్పొరేట్ విద్యకే ప్రభుత్వం కొమ్ము కాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాస్తవాలు తెలియజేసేందుకే బుక్‌లెట్ ఆవిష్కరణ

మహిళలను, రైతులను, నిరుద్యోగులను, ఉద్యోగులను ఇలా.. ప్రతి ఒక్కరినీ మోసం చేసిన చంద్రబాబు పాలన, అరాచకం గురించి ప్రజలకు వివరించేందుకు జిల్లా కేంద్రంలో, నియోజవర్గ కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో, గ్రామ ప్రజలకు అందుబాటులోకి ఈ బుక్‌లెట్ తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో 40వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమసింహారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, మండల ఉపాధ్యక్షులు నెహెమ్యా, అధికార ప్రతినిధి పోలకల్ ప్రభాకర్ రెడ్డి, కోడుమూరు ప్రచార విభాగం అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, కోడుమూరు ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుజ్జన్న, రేమట సంపత్‌కుమార్, మండల కన్వీనర్ మోహన్‌బాబు, ఎంపీటీసీ గోపాల్, క్రిష్ణ, సురేష్, ఆదాం, మదు, క్రిష్ణ రెడ్డి, ఎదురూరు వెంకటేష్, బైరాపురం క్రిష్ణ, మధు శేఖర్, శివుడు, అయ్యస్వామి, అనిల్ బాష, మహేష్, మద్దిలేటి, రామరాజు, క్రిష్ణ, సలీం పాల్గొన్నారు.

భయభ్రాంతులకు గురిచేసేందుకే రెడ్‌బుక్ రాజ్యాంగం

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను సైతం వేధించడం, అక్రమ కేసులు నమోదు చేయడం, జైళ్లకు పంపడం దుర్మార్గమన్నారు. బాబు ఏడాది పాలన అంతా అరాచకం, వైఎస్సార్‌సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలను బెదిరించడం. అక్రమంగా కేసులు నమోదు చేయడంతోనే గడిచిపోయిందన్నారు. విధ్వంస పాలనను ప్రజలు క్షమించరని చెప్పారు. ప్రజలంతా కూటమి పాలనను గత ప్రభుత్వ పాలనతో పోల్చి చూస్తున్నారని బాబుకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో వైద్య రంగం తిరోగమనంలో కొనసాగుతుందని, ఆరోగ్యశ్రీ అటకెక్కిందన్నారు. జగనన్న ప్రభుత్వంలో 17 మెడికల్ కళాశాలలను తీసుకొస్తే వాటిని నడపడం చేతగాక ప్రైవేటు పరం చేస్తామని ప్రకటించడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. కూటమి ఏడాది పాలనలోనే అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు ప్రజల తరఫున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

హామీలు అమలుచేసే వరకు పోరాటం



సీఎం చంద్రబాబు మోసాలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్వీ విజయ మనోహరి, తదితరులు

- సీఎం చంద్రబాబు మోసాలపై వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరణ
- కేడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్‌పర్సన్ విజయ మనోహరి

కర్నూలు (టౌన్): కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని కేడీసీసీబీ మాజీ ఛైర్‌పర్సన్ విజయ మనోహరి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక గిప్సన్ కాలనీలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి స్వగృహంలో.. ఏడాది పాలనలో సీఎం చంద్రబాబు హామీల మోసాలు, అరాచకాలు, వెన్నుపోటును వివరిస్తూ రూపొందించిన పుస్తకాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏడాది పాలన ముగిసినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం అంతులేని జాప్యం చేస్తోందన్నారు. అలవిగాని హామీలు ఇచ్చి లేని ఆశలు కల్పించి ఇప్పుడు చేతులెత్తేశారని విమర్శించారు. ఇప్పుడు 'తల్లికి వందనం' నిధులు మంజూరు చేశారంటే అది వైఎస్సార్‌సీపీ పోరాట ఫలితమే అన్నారు. జగనన్న కన్నా రెండింతలు పథకాలు అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు ప్రజలను దగా చేశారన్నారు.

రాష్ట్రంలో హోం మంత్రి ఉన్నారా?

రాష్ట్రంలో హోం మంత్రి ఉన్నారా? పనిచేస్తున్నారా? అని ఎస్వీ విజయ మనోహరి ప్రశ్నించారు. కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మానభంగాలు, రేప్‌లు, చిన్నారులపై అఘాయిత్యాలు, దాడులు, హత్యలు పెరిగిపోయాయన్నారు. వీటిని నిలువరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫలమైందన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో హోంమంత్రి విఫలమయ్యారని విమర్శించారు. విచ్చలవిడిగా గంజాయి వినియోగం, నాటు సారా వల్లే రాష్ట్రంలో నేరాలు పెరిగిపోయాయన్నారు. వీటిని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు చివరకు జర్నలిస్టులను సైతం జైళ్లకు పంపిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అక్రమ కేసులు పెట్టి వైఎస్సార్‌సీపీ క్యాడర్‌ను బెదిరించాలని చూస్తే బెదిరే పరిస్థితులు లేవని తేల్చి చెప్పారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. ఏడాది పాలనలోనే ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, యాభై ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలందరికీ రూ.4 వేలు పెన్షన్, ఏడాదికి 5 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు మునెమ్మ, షేక్ యూనూస్ బాషా, ప్రధాన కార్యదర్శి షరీఫ్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి, భారతి, నగర అధ్యక్షురాలు మంగమ్మ, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ లైబ్రరీకి కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ లైబ్రరీకి పూర్వ విద్యార్థులు రెండు కంప్యూటర్‌లు, స్పీడ్ ఇంటర్నెట్, ఆధునిక జర్నల్స్‌ను లైబ్రరీకి వితరణగా అందజేశారు. కళాశాలలో చదివి ప్రస్తుతం అమెరికాలో నివశిస్తున్న డాక్టర్ ఆదిశేషారెడ్డి బెల్లం, ఆయన సతీమణి డాక్టర్ రేణుకారెడ్డి నీలం కళాశాలలో చదువుతున్న వైద్య విద్యార్థుల కోసం సోమవారం వీటిని పంపించారు. వాటిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించి మాట్లాడారు. కళాశాల గ్రాడ్యుయేషన్స్ ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ రామలింగారెడ్డి, కళాశాల అలుమ్ని అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కుమారస్వామిరెడ్డి, ట్రెజరర్ డాక్టర్ మహేశ్వరరెడ్డి కేజీ.గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి



యోగాభ్యసన చేస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరి దినచర్య, జీవితంలో యోగా ఒక భాగం కావాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ చెప్పారు. యోగాంధ్ర మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలో యోగా సెషన్ నిర్వహించారు. పతంజలి యోగా సమితి గురువు ఎస్వీ శివరాజు, భారత స్వాభిమాన్ ట్రస్ట్ యోగా గురువు ఉపేంద్ర ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య విద్యార్థులు యోగాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని కర్నూలు మెడికల్ కాలేజీలో యోగా సెషన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ సోమశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యోగా ప్రదర్శనను విజయవంతం చేయండి



స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా జిల్లావ్యాప్తంగా మంగళవారం 5 వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో నిర్వహించనున్న సామూహిక యోగా ప్రదర్శనను విజయవంతం చేయాలని నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు వెల్లడించారు. సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని గత నెల రోజులుగా అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఔట్‌డోర్ స్టేడియంలో 5 వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో నిర్వహిస్తున్న ఈ యోగా ప్రదర్శనలో ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ప్రదర్శనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామని, నగర ప్రజలు సైతం హాజరుకావాలని పిలుపునిచ్చారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, డీఈఈలు గంగాధర్, గిరిరాజ్, నరేష్ పాల్గొన్నారు.

ఏకాగ్రతతోనే లక్ష్యసాధన



విలు విద్య పోటీలను ప్రారంభిస్తున్న హరినాథ్ చౌదరి

కర్నూలు (టౌన్): ఏకాగ్రతతోనే విలు విద్య క్రీడాంశంలో రాణించగలరని జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు హరినాథ్ చౌదరి అన్నారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఒలింపిక్ డేను పురస్కరించుకుని విలు విద్య పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏకలవ్యుడి స్ఫూర్తితో బాల బాలికలు విలు విద్యలో ప్రతిభ చాటాలని సూచించారు. అనంతరం నిర్వహించిన పోటీలో సబ్ జూనియర్స్ విభాగంలో లోహిత్, మోహిత, దేవ, జూనియర్స్ బాలుర విభాగంలో జైశ్వాల్, ఇమ్రాన్, అరుణ్, జూనియర్స్ బాలికల విభాగంలో దివ్య ఏంజెల్, కీర్తన, సుహానా, సీనియర్ మహిళల విభాగంలో వెన్నెల, రేణుక, సాయి హర్షిత విజేతలుగా నిలిచారు. వీరికి ఈనెల 23న నిర్వహించే ఒలింపిక్ డే రన్ కార్యక్రమంలో మెడల్స్, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తారని ఆర్చరీ జిల్లా కార్యదర్శి నాగరత్నమయ్య వెల్లడించారు. విలు విద్య సంఘం అధ్యక్షుడు సునీల్‌కుమార్, శిక్షకులు బాలాజీ రెడ్డి, న్యాయవాదులు దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ సామగ్రి తరలింపును ఆపాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కర్నూలు(సెంట్రల్): వీబీసీ (పాత కార్బైడ్) ఫ్యాక్టరీ సామగ్రి అక్రమ తరలింపును అడ్డుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం వీబీసీ యంత్ర సామగ్రిని తరలించడాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు బకాయి ఉన్న పీఎఫ్ సొమ్ము చెల్లించకుండా ఫ్యాక్టరీకి చెందిన వివిధ యంత్రాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తరలించరాదన్నారు. దాదాపు 25 సంవత్సరాల క్రితం 250 మంది కార్మికులతో ప్రారంభమైన పరిశ్రమను కొందరు కావాలనే దివాళా తీయించినట్లు చెప్పారు. వీబీసీ యాజమాన్యం చేతికి వచ్చిన తరువాత కార్మికులకు వేతనాలు సరిగా ఇవ్వకపోవడం, పీఎఫ్ చెల్లించకపోవడంతో మూత పడినట్లు చెప్పారు. ప్రస్తుతం మూతపడిన దాదాపు 500 కోట్ల విలువైన పరిశ్రమను వీబీసీ వారు వేరే యాజమాన్యానికి రూ.100 కోట్లకు అప్పగించిందని, అందులో కూడా వారు కేవలం రూ.40 కోట్లు మాత్రమే చెల్లించారన్నారు. ఇంతలోనే పరిశ్రమలోని విలువైన యంత్ర సామగ్రి, ట్రాన్స్‌ఫార్మర్లను తరలించేందుకు కుట్ర చేస్తున్నట్లు చెప్పారు. కార్మికుల పెండింగ్ వేతనాలు, పీఎఫ్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలి



క్లాప్ డ్రైవర్లకు జీతాలు చెల్లించాలని వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ బృందం

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య, ఇన్‌చార్జ్ డీఆర్వో బీకే వెంకటేశ్వర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలన్నారు. రీఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, లాగిన్‌లో వచ్చిన అర్జీలను అలసత్వం లేకుండా ఎప్పటికప్పుడు చూడాలని సూచించారు. మరోవైపు సీఎంఓ నుంచి వచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

నేడు 5 వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో యోగా

థిమాటిక్ యోగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవుట్‌డోర్ స్టేడియంలో 5 వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతోపాటు వారి సిబ్బంది కూడా పాల్గొనాలని ఆదేశించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించే యోగా కార్యక్రమానికి జిల్లా నుంచి 11 లక్షల మంది హాజరయ్యేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు చెప్పారు.

క్లాప్ డ్రైవర్ల ఆకలి బాధలను అర్థం చేసుకోండి

కర్నూలు నగరంలో పనిచేసిన స్వచ్ఛాంధ్ర క్లాప్ డ్రైవర్ల ఆకలి బాధలను అర్థం చేసుకోవాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న 5 నెలల వేతనాలు ఇప్పించాలని కోరారు. వేతనాలు అందక వారి కుటుంబాలు పస్తులు ఉంటున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. రిక్రూట్ అయిన ఆటో డ్రైవర్లకు రూ.18,500 జీతంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాల్సి ఉన్నా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించండి

జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీడబ్ల్యూజేఎఫ్ బృందం జిల్లా కన్వీనర్ నాగేంద్ర ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఏలూరు, కృష్ణా జిల్లాల మాదిరిగా కర్నూలు జిల్లాలోనూ జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అందుకు ఆయన స్పందించి త్వరలోనే డీఈఓతో సమావేశం ఏర్పాటు చేయిస్తానని చెప్పారు.

కేడీసీసీబీలో సింధూర్ డిపాజిట్ స్కీమ్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకును అభివృద్ధి బాటలో నడిపించేందుకు ప్రతిఒక్కరూ జవాబుదారీతనంతో పనిచేయాలని చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి బ్రాంచ్ మేనేజర్లను ఆదేశించారు. సోమవారం మొదటిసారిగా నిర్వహించిన బ్రాంచ్ మేనేజర్ల సమావేశంలో ఆయన పాల్గొని బ్యాంకును లాభాల బాటలో నడిపించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు ఇచ్చారు. 2024–25 సంవత్సరానికి పేరుకుపోయిన రూ.265 కోట్ల బకాయిలను తగ్గించాలన్నారు. ప్రతి రైతును కలసి బకాయిలు వసూలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. 2025–26లో బ్యాంకు టర్నోవర్ రూ.4500 కోట్లకు పెంచాలన్నారు. బ్యాంకును లాభాల్లోకి తీసుకెళ్లడం ద్వారా సభ్యులైన పీఏసీఎస్‌లకు 2–3 శాతం డివిడెంటు ఇచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. బ్యాంకులో 333 రోజుల సింధూర్ డిపాజిట్ పథకాన్ని చైర్మన్ ఆవిష్కరించారు. సీనియర్ సిటిజన్లకు 6.90, ఇతరులకు 6.40 శాతం వడ్డీరేటు ఉంటుందని, ఈ అవకాశం జూన్ 16 నుంచి జూలై 15 వరకు మాత్రమే ఉందని తెలిపారు. సీఈఓ రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ప్యాక్స్ డెవలప్‌మెంటు సెల్ మేనేజర్ నదిమా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

19న క్రికెట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు అండర్–16 బాలుర విభాగంలో క్రికెట్ జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేంద్రగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

20న షూటింగ్ బాల్ పోటీలు

కర్నూలు (టౌన్): అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 20వ తేదీన శుక్రవారం స్థానిక విఠల్ నగర్‌లో ఉన్న గుడ్‌షప్పర్డ్ క్రీడా మైదానంలో సబ్ జూనియర్ బాలబాలికలకు జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల షూటింగ్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజినేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు నిర్వహణ కార్యదర్శి మధు సెల్‌నంబర్ 9642151516ను సంప్రదించాలన్నారు.

విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి



అధికారులకు వినతి పత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఓర్వకల్లు : మండలంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో యాజమాన్యం చేస్తున్న దోపిడీని అరికట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్న, ఏపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగసురేంద్ర యాదవ్ తదితరులు సోమవారం ఎంఈఓ ఓంకార్ యాదవ్, ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. మండలంలోని ప్రైవేట్, కార్పొరేట్ స్థాయి పాఠశాలల్లో యాజమాన్యం కేవలం ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలతో పాటు, బూట్లు, టై, బెల్టులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో మండల నాయకులు రాము, వెంకటేష్, మధు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీల వాసులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని గోవర్ధన్ నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజా చైతన్య పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్, కార్యదర్శి క్రాంతికుమార్ విన్నవించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమ వారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే

- సంజయ్ గాంధీ నగర్‌లో కల్వర్టు నిర్మించాలని స్థానికులు ఉపేంద్ర, అఖిల్ విన్నవించారు.
- సంతోష్ నగర్, ఉమాన్ నగర్‌లో డ్రైనేజీ కాల్వలు, రహదారులు నిర్మించాలని సంతోష్‌నగర్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యదర్శి రంగయ్య అభ్యర్థించారు.
- కృష్ణా నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు మల్లికార్జున ఫిర్యాదు చేశారు.
- ఎర్రబురుజు వీధి, పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కాశపోగు ప్రకాష్ విన్నవించారు.

టీబీ పరీక్షలు చేయించుకోవాలి

పెద్దకడబూరు : రెండు వారాలకు మించి దగ్గు, జ్వరము, తేమడలో రక్తం పడటం, ఛాతిలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, ఆకలి మందగించడం, బరువు కోల్పోవడం, శరీరంలోని ఇతర భాగాలలో వాపు తదితర లక్షణాలు ఉన్నవారు తప్పక టీబీ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా లెప్రసి ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ భాస్కర్ సూచించారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ముందుగా క్షయవ్యాధి అనుమానిత లక్షణాలు ఉన్న 63 మందికి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి ఒక అంటువ్యాధి అని, రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు గాలిద్వారా ఇతరులకు సోకే ప్రమాదం ఉందన్నారు. డాక్టర్ సుస్మిత, టీబీ సూపర్‌వైజర్లు చాంద్‌బాషా, మల్లికార్జున, ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, శ్రీధర్, సీహెచ్‌ఓలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళకు గాయాలు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన శ్రావణి అనే వివాహిత ఆదోనిలోని ఎల్‌సీ గేటు 195 వద్ద ట్రాకు దాటుతుండగా రైలు ఢీకొందని రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. రైలు నంబర్ 17301 బసవ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో శ్రావణి తీవ్రంగా గాయపడిందని, వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.